నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా అస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 28న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంత్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..

సైదాబాద్ 2ఆర్‌టీ మెయిన్‌రోడ్, వెంగళరావ్ పీటీ, సైదాబాద్ రామాలయం, ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, లక్ష్మీనగర్ సాయిబాబా టెంపుల్, తీగలగూడ, అఫ్జల్‌నగర్, రేస్‌కోర్స్ రోడ్, ఆర్‌టీఓ ఆఫీస్, బీలాజీ పీటీ, పీఅండ్‌టీ కాలనీ కౌంటర్, కమ్యూనిటీహాల్, చౌరస్తా, కోదండరాంనగర్ హనుమాన్ టెంపుల్, వీవీ నగర్, శారదనగర్, లాలాజర్ లేన్, సోయబ్ మెమోరియల్ పార్క్, వాకీ గ్రౌండ్, వాలీబాల్ గ్రౌండ్, బ్యాంక్ ఆఫ్ బరోడా, గుల్జార్ మజీద్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 12 నుంచి 1:30 వరకు..

పూర్ణోదయా కాలనీ, పూర్ణోదయా కాలనీ పార్క్, ఓల్డ్ ఆర్‌టీఏ ఆఫీస్, ఫ్రెండ్స్ కాలనీ, సవేరా టిఫిన్ సెంటర్, బొమ్మనా బ్రదర్స్, ఆర్‌ఎస్ బ్రదర్స్, సాయిబాబా టెంపుల్, దిల్‌సుఖ్‌నగర్ మెయిన్ రోడ్, మోతీ మజీద్, నాలా, బడా మందిర్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

అస్మాన్‌ఘడ్, సంజయ్‌గాంధీ నగర్, మాధవ్‌నగర్, బిలాల్ మజీద్, సపోటా బాగ్, ఎల్‌ఐసీ కాలనీ, బాకర్‌బాగ్, మోర్ సూపర్ మార్కెట్, నాగ దేవాలయం, మండల్ ఆఫీస్, బాలదానమ్మ బస్తీ, గణేశ్ టెంపుల్ మెయిన్‌రోడ్, జీపీ బ్యాంక్ కాలనీ, త్రివేణినగర్, వీకే దాగే నగర్, అజంపురా చమన్, సహిఫా మజీద్, అజంపురా పోస్ట్ ఆఫీస్ లేన్, అజంపురా కాంటా, టార్జాన్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 28న (నేడు)పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంజిరెడ్డినగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మాధ్యాహ్నం 12.30 గంటల వరకు సాయిరాం నగర్, ప్రెస్ కాలనీ, అంజిరెడ్డి, న్యూపద్మానగర్, కల్యాణిమోటర్స్, ఎంఆర్‌ఆర్, ఉదయ్‌నగర్, పవన్‌పురి, విష్ణుపురి కాలనీలు.

మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల వరకు

పద్మానగర్, క్రాంతినగర్, రాఘవేంద్ర, నిర్మలానగర్, జ్యోతినగర్, కర్మన్‌ఘాట్ పాత బస్తీలో కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనివాసనగర్, శ్రీరాంనగర్, తపోవన్ గ్రీన్‌పార్కు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నాగోలు: డివిజన్ పరిధిలోని ఇందు అరణ్య విల్లాస్ నుంచి ఫత్తుల్లాగూడ మీదుగా మూసీ వరకు గల రోడ్డుపై నాగోలు పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ రహదారిలో రాత్రి సమయంలో మందుబాబులు తిష్ట వేస్తూ, యువకులు బైక్‌లు, కార్లు రేస్‌లకు పాల్పడుతున్నారు. మూడు రోజుల క్రితం యువతి, యువకుడు ఉదయం మద్యం తాగుతూ హంగామా సృష్టించారు. దీంతో నాగోలు పోలీసులు అప్రమత్తమై చర్యలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాగోలు ఎస్‌ఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్‌లోని సాహెబ్‌నగర్ గ్రామంలో గల శ్రీ త్రినేత్ర ఆంజనేయస్వామి ఆలయలో స్థానిక కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో టెంపుల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, రవిశంకర్, నర్సింహరెడ్డి, దేవిక, సురేశ్‌కుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

తయ్యబా సుల్తానాకు సన్మానం



సుల్తానాను సన్మానిస్తున్న అజయ్ కార్తీక్

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ఆల్ఫామోడల్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ తయ్యబా సుల్తానాకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఇటీవల డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. దీంతో సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి టీసీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కార్తీక్ ముఖ్యఅతిథిగా హాజరై ఆమెకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, నిరంజన్, అక్బర్, పావని, పల్లవి, అనూష, రమాదేవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీకి యత్నం



స్థానికులు పట్టుకున్న షేక్ ఫరీద్

నాగోలు: ఇంట్లో చోరీకి యత్నించిన దుండగుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పజెప్పిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం బండ్లగూడ బృందావన్ కాలనీలో ఓ ఇంట్లోని మొదటి అంతస్తుకు వెళ్లేందుకు గుర్తు తెలియని వ్యక్తి వెళ్లి మెట్ల కింద ఉన్నాడు. గమనించిన కింద అంతస్తు వారు ఎందుకు వచ్చావని నిలదీయగా అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నం చేయగా స్థానికులు పట్టుకున్నారు. వివరాలు అడగగా పొంతన లేని సమాధానం చెప్పాడు. దీంతో స్థానికులు నాగోలు పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చోరీ కోసం వచ్చిన వ్యక్తి షేక్ ఫరీద్ (30) జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. నల్గొండలోని శాంతినగర్‌లో నివాసం ఉండే అతను బండ్లగూడ ప్రాంతంలో కొంతకాలంగా అద్దెకు ఉన్నట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు షేక్ ఫరీద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు మేలు



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

నాగోలు: సీఎంఆర్‌ఎఫ్‌తో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీకి చెందిన అరవింద్ కుమార్ వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను సంప్రదించగా వెంటనే స్పందించిన ఆయన ఆపరేషన్‌కు కావాల్సిన ఆర్థిక సాయం కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేశారు. రూ.1.50 లక్షల ఎల్వోసీ చెక్కు మంజూరు కాగా ఎమ్మెల్యే బాధితుడు కుటుంబ సభ్యులకు సోమవారం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బాధితుడి తల్లి ప్రసన్న రాణి, రాకేశ్ ఠాగూర్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలను పరిశీలించిన జీఎం

సాక్షి ఎఫెక్ట్..



ధ్వంసమైన ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ సిరివెన్నల

ఎల్‌బీనగర్: నీటి సంరక్షణపై వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యంపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని హరిహరపురం, శ్రీకృష్ణదేవరాయకాలనీలో ధ్వంసమైన ఇంకుడు గుంతలను వాటర్ వర్క్స్ జీఎం శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి వర్షం నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలని, ఇంకుడు గుంతలో చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ సిరివెన్నల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ హరి

చైతన్యపురి: ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపో మేనేజర్ హరి అన్నారు. డిపోలో ఏర్పాటు చేసిన 'గ్రాండ్ హెల్త్ చాలెంజ్-2' కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 రోజుల పాటు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, అవుట్ సోర్సింగ్, సెక్యూరిటీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్, హెల్త్ వలంటీర్స్ సువర్ణ, పురుషోత్తం సిబ్బంది బుచ్చిరెడ్డి, జీఎస్‌రెడ్డి, అశోక్, లలిత తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి



తలసేమియా వ్యాధి కేస్ స్టడీస్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

మన్సూరాబాద్: జన్యుపరంగా సక్రమించే తలసేమియా వ్యాధిపై ప్రజలు అగాహన పెంచుకోవాలని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్ హిమటాలజీ, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ హెడ్ డాక్టర్ సచిన్ జాదవ్ అన్నారు. హాస్పిటల్‌లోని ఇందిరా ఆడిటోరియంలో వ్యాధిపై అవగాహనతో పాటు కేస్ స్టడీలతో రూపొందించిన బుక్‌లెట్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించి, హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకువచ్చిన చికిత్సను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమించే తలసేమియా వ్యాధితో విపరీతమైన అలసట, నీరసం, చర్మం పాలిపోవడం, ముఖం ఆకారంలో మార్పులు, ఎదుగుదల లేకపోవడం, పొట్టవాపు, మూత్రం ముదురు రంగులో రావడం లాంటి లక్షణాలుంటాయని తెలిపారు. వివాహానికి ముందు తలసేమియా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇద్దరిలో ఏ ఒక్కరికి తలసేమియా లక్షణాలున్నా జన్యుపరంగా కౌన్సిలింగ్ తీసుకోవాలన్నారు. ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో తలసేమియా క్లీనిక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, అంతేకాకుండ జన్యు కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్. నర్సింహరావు, ఎంఆర్‌ఎం బాబు, నవ్యశ్రీ , కంచన్ ఎస్ చన్నవార్, సత్యనారాయణ, సురేశ్ థామస్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు చింతపల్లియ కాశీనాథ్ ఆధ్వర్యంలో నాడురాక్‌టౌన్ కార్యాలయంలో రమాబాయి అంబేడ్కర్ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాలకు అంబేడ్కర్ చేసిన పోరాటానికి ఆమె ఎంతో సహకరించారన్నారు. పేద వర్గాల అభ్యున్నతికిబ నిరంతరం పరితపించిన గొప్ప నాయకురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మహేశ్‌బాబు, జగన్, పుట్ట కాశీనాథ్, శ్రీకాంత్, వెంకన్న, ముఖేష్ పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో..రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా లోకల్ 31, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్18, క్యాబేజీ 18, క్యారెట్ 37. దొండ 28, ఆలు 31, ఉల్లి 26, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 18, అరటి 9, చిక్కుడు 85, అర్వి 40, మునగ 45, చిలగడ దుంప 45, బీట్‌రూట్ 17, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 155, కాప్సికమ్ 55.

ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమల్లో ఉంటాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

చైతన్యపురి: చైతన్యపురిలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు.. నేపాల్‌కు చెందిన కమల్ బహదూర్ (39) కుటుంబంతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి వాచ్‌మన్‌గా పనిచేశాడు. అనంతరం నల్గొండ జిల్లా చిట్యాలలోని ఓ కంపెనీలో వాచ్‌మన్‌గా కొంత కాలంగా చేస్తున్నాడు. ఇటీవల సొంత గ్రామం ఖాట్మండ్‌కు వెళ్తుండగా ఉత్తరప్రదేశ్‌లోని లక్నో వద్ద విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో బహదూర్‌ను చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తీసుకుచ్చారు. అనంతరం 21న చైతన్యపురిలోని షణ్ముక్ వైష్ణవి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు వైద్యులు మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. అయితే రూ. 8 లక్షలు తీసుకుని సరైన వైద్యం అందించలేదని ఆరోపిస్తూ బంధువులు, స్నేహితులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు హాస్పిటల్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.



అపరిశుభ్రంగా అంతర్గత రోడ్లు..!

ఆర్‌కేపురం డివిజన్‌లోని ఎన్‌టీఆర్‌నగర్ బస్తీ అంతర్గత రోడ్లు అపరిశుభ్రతతో దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ నుంచి తీసిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో రోడ్ల వెంట దుర్వాసన వస్తోందని, అంతేగాకుండా దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో నిత్యం పారిశుధ్యం పనులు చేపట్టలని స్థానికులు కోరుతున్నారు. –దిల్‌సుఖ్‌నగర్

గొర్రెల నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలి

వనస్థలిపురం: గొర్రెల నట్టల నివారణ మందులను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా. దాసరి అజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 10 లక్షల మంది గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారని, 2 కోట్ల గొర్రెలు, మేకలు ఉన్నాయని పేర్కొన్నారు. మందులు పంపిణీ చేయకపోవడంతో గొర్రెల కాపరులు ప్రైవేట్ దుకాణాలకు వెళ్లి మందులు కొని అప్పుల పాలు అవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే గొర్రెలు పంపిణీ చేస్తామన్న హామీని సీఎం రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గొర్రెల కాపరులకు ఇచ్చిన హామీలు నెలబెట్టుకోవాలని కోరారు.

బీసీల అభ్యున్నతే ధ్యేయం



అవార్డు అందుకుంటున్న రాజేశ్వర్‌యాదవ్

చంచల్‌గూడ: బీసీల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది ఏ. రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. సూర్యచంద్ర సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతులగా మీదుగా సేవారత్న అవార్డును ఆయన అందుకున్నారు. రాజేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ న్యాయవాదిగా, బీసీ సంఘం నేతగా 35 ఏళ్లుగా బడుగు, బలహీన వర్గాల వారికి ఎన్నో సేవలు చేశానని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందని పేర్కొన్నారు.

కల్లుగీత సహకార సంఘం కమిటీ ఎన్నిక



కల్లుగీత సహకార సంఘం సభ్యులతో ఎక్సైజ్ అధికారి మహమ్మద్ రఫీ

మన్సూరాబాద్: ఎక్సైజ్ అధికారి మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ కల్లుగీత సహకార సంఘం ఎన్నికలను మన్సూరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాతూరి శ్రీధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పాతూరి వెంకటస్వామిగౌడ్, డైరెక్టర్లుగా పాతూరి సాయిదాస్‌గౌడ్, పాతూరి సునీల్‌గౌడ్, పాతూరి వసంత ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు బాల్‌రాజ్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, నాగరాజుగౌడ్, మహేందర్‌గౌడ్, రఘుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

చైతన్యపురి: కాలనీల్లో నూతన పైపులైన్లు ఏర్పాటు చేసి డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. డివిజన్‌లోని న్యూ మారుతీనగర్ కాలనీ రోడ్ నంబర్-12ఏలో డ్రైనేజీ పైపులైన్ పాడైపోయిన విషయం తెలుసుకుని అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. మురుగు నీరు ఇండ్లు, రహదారులపై పారకుండా నూతన లైన్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేందర్, జవాన్ శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.